

మహిళా ఓటర్లే అధికం

- పార్లమెంట్ పరిధిలో మొత్తం 8,77,225 మంది మహిళా ఓటర్లు
- వారి మద్దతును కూడగట్టేందుకు ప్రధాన పార్టీల యత్నం
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ
- ఎన్నికల ప్రచారానికి ఏర్పాట్లు చేస్తున్న బీఆర్ఎస్
- ఇంకా ఎంపీ అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్

నిజామాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ దఫా త్రిముఖ పోటీ నెలకొంది. గెలుపే అన్ని పార్టీలకు ముఖ్యం కావడంతో వారంతా మహిళా ఓటర్లపై నజర్ పెడుతున్నారు. పార్లమెంట్ పరిధిలో వారే ఎక్కువగా ఓటర్లుగా ఉండటంతో వారి మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రభుత్వాలు వారి కోసం ఎలాంటి పథకాలను ప్రవేశపెట్టాయో వివరిస్తూనే పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. గత పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో వారు మొగ్గుచూపిన అభ్యర్థులే గెలవడంతో ఈ దఫా కూడా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వారిపైనే దృష్టిపెట్టి ప్రచారాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ అభ్యర్థిని త్వరలోనే ప్రకటించనుండటంతో మూడు పార్టీల నేతలు పూర్తిస్థాయిలో ప్రచారంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ కూడా రావడంతో తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్లమెంట్ పరిధిలో మొత్తం 16లక్షల 72 వేల 118 మంది ఓటర్లు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఏడు నియోజకవర్గాల్లో వారి ప్రాతినిధ్యమే ఎక్కువగా ఉంది. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16లక్షల 72 వేల 118 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7లక్షల 94వేల 819 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8లక్షల 77వేల 225 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 74 మంది ఉన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 10వేల 217 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 98వేల 274 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 11వేల 937 మంది ఉన్నారు. ఇతరులు 6 ఉన్నారు. బోధన్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 20వేల 068 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 5,573 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 14వేల 490 మంది ఉన్నారు. ఇతరులు 5 ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ మొత్తం 2లక్షల 94వేల 832 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 43వేల 211 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 51వేల 589 మంది ఉన్నారు. ఇతరులు 32 ఉన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 53వేల 233 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 18వేల 627 మంది ఉండగా మహిళా ఓటర్లు ఒకలక్షా 34వేల 601 మంది ఉన్నారు. ఇతరులు 5ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 21వేల 445 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 2వేల 387 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 19వేల 056 మంది ఉన్నారు. ఇతరులు 2 ఉన్నారు. కోరుట్ల నియోజ కవర్గంలో మొత్తం 2లక్షల 40వేల 855 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 15వేల 027 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 25వేల 824 మంది ఉన్నారు. ఇతరులు 4 ఉన్నారు. జగిత్యాల్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 31వేల 468 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 11వేల 720 మంది ఉండగా మహిళా ఓటర్లు లక్షా 19వేల 728 మంది ఉన్నారు. ఇతరులు 20 ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కు వగా ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో కూడా ఓటింగ్‌కు వీరే ఎక్కువగా వచ్చారు. తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు.

అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ దఫా నిజామాబాద్ సీటును గెలుచుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికి అభ్యర్థిని ప్రకటించకున్నా పార్టీ నేతల ద్వారా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆరు గ్యారెంటీల అమలును గ్రామాల వరకు తీసుకు వెళ్తూ పార్లమెంట్ ఎన్నికలకు మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థిని ప్రకటించ గానే పూర్తి స్థాయిలో ప్రచారాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసు కుంటున్నారు. మహిళలే కీలకం కావడంతో వారికి ప్రవేశ పెట్టిన పథకాలను ప్రచారం చేయడంతో పాటు పూర్తి స్థాయిలో మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నా లు కొనసాగిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన విధంగానే పార్లమెంట్ ఎన్నికలకు కూడా మద్దతు ఇచ్చే విధంగా గ్రామస్థాయి నుంచి నేతలు సమన్వ యంతో పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలను నిర్వహిస్తూ ఈ మద్దతును కూడగడుతున్నారు.

సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీజేపీ యత్నం

సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ నిలుపుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంపీ అరవింద్ పూర్తిస్థాయిలో ప్రచారం చేపట్టడంతో పాటు మహిళల కోసం కేంద్ర చేస్తున్న పనులను వివరిస్తున్నారు. పలు పథకాలను అమలు చేస్తున్నామని గ్రామస్థాయిలో క్యాడర్ ద్వారా మహిళా సంఘాలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నిర్వహించే ప్రతి సమావేశానికి వారే ఎక్కువగా హాజరయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జగిత్యాలలో సోమవారం నిర్వహించిన ప్రధాని మోదీ సభకు కూడా పార్లమెంట్ పరిధిలోని మహిళా ఓటర్లు ఎక్కువ మంది హాజరయ్యే విధంగా చూశారు. పూర్తిస్థాయిలో వారి మద్దతు కూడగట్టుకునేందుకు పార్టీ నేతలు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రానున్న రోజుల్లో మహిళల మద్దతును కూడగట్టే విధంగా సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ పార్టీ నేతలు కూడా ఎక్కడికక్కడ మహిళా గ్రూపులకు కేంద్రం ఇస్తున్న వడ్డీలేని రుణాలు ఇతర పథకాలను వివరిస్తూ వారు ముందుకు పోయేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి

బీఆర్ఎస్ పార్టీ నేతలు కూడా మహిళల మద్దతును కూడగట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో శాసనసభ ఎన్నికల్లో మూడు స్థానాలను కట్టబెట్టడంలో మహిళల పాత్రనే ఎక్కువగా ఉండటంతో ఈ దఫా కూడా వారి మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను ప్రకటించడంతో ఆయన ప్రచారానికి ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలో మహిళలే ఎక్కువగా ఉండటం వల్ల పూర్తిస్థాయిలో వారి మద్దతును కూడగట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. పార్టీ క్యాడర్‌ను కలుపుకొని ముందుకుపోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పార్టీలోని మిగతా నేతలను కలుపుకొని ముందుకు పోయేందుకు సిద్ధమవుతున్నారు.

పార్లమెంట్ పరిధిలో ఈ దఫా పోటీ ఎక్కువగా ఉండటం మూడు పార్టీల నేతలు మహిళలపైనే ఫోకస్ పెడుతుండటంతో వారు ఏవైపు మొగ్గితే ఆ పార్టీ అభ్యర్థికి అవకాశం ఉండటంతో ఈ దఫా వారే కీలకం కానున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో అన్ని పార్టీల నేతలు ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్లు వేసిన తర్వాత మహిళలు ఏవైపు మొగ్గుతున్నారో తేలే అవకాశం ఉంది.

సీఎంసీ కళాశాలను సందర్శించిన కలెక్టర్

- కౌటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లపై అధికారులతో ఆరా



ఎంపీ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ సీఎంసీని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

డిచ్‌పల్లి, మార్చ్ 18: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలయ్యే ఓట్లను సీఎంసీలో లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపుతో పాటు అర్బన్, రూరల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈవీయంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలకు చేపడుతున్న ఏర్పాట్లు వసతులను పరిశీలించి అధికారులకు సూచనాలు చేశారు. భద్రత పరమైన అంశాలను నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన మార్పులను, చేర్పులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగు రూంల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు చే పట్టలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, ఏసీపీ రాజావెంకటరెడ్డి, పీడీ రాజేందర్, ట్రాన్స్‌కో ఏసీఈ రవీందర్, ఏడీఈ రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి యోహన్, ఈడీఎం కార్తిక్, తదితరులు ఉన్నారు.



ఉత్కంఠ

- ఈ నెల 4న డీసీసీబీ చైర్మన్‌పై 15 మంది డైరెక్టర్ల అవిశ్వాస తీర్మానం
- కోర్టును ఆశ్రయించిన చైర్మన్
- నేడు విచారణ చేపట్టనున్న కోర్టు

నిజామాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ అవిశ్వాసంపై నేడు తేలనుంది. డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస నోటీసుపై చైర్మన్ కోర్టును ఆశ్రయించారు. అవిశ్వాసాన్ని ఆపాలని కోరారు. దీంతో ప్రభుత్వం నుంచి వివరాలు కోరిన కోర్టు మంగళవారం పరిశీలించి అవిశ్వాసం తీర్మానంపై నిర్ణయం తీసుకోనుంది. చైర్మన్‌పై 15మంది డైరెక్టర్లు ఈనెల 4న అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెటడంతో జిల్లా సహకార అధికారులు నిర్ణయం తీసుకున్నారు. డైరెక్టర్లకు నోటీసులు ఇవ్వడంతో పాటు ఈనెల 21న అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై చైర్మన్ కోర్టుకు వెళ్లడంతో ఉత్కంఠ నెలకొంది.

అవిశ్వాసంపై రాజకీయ ప్రాధాన్యం

జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాసం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. చైర్మన్‌పై 15 మంది డైరెక్టర్లు ఈనెల 4న అవిశ్వాసం ప్రవేశపెట్టినట్లు జిల్లా సహకార అధికారులకు నోటీసులు ఇచ్చారు. తమ సంతకాలతో కాపీని అందజేశారు. నిబంధనలకు ప్రకారం 11మంది డైరెక్టర్లు సంతకాలు చేసి ఇస్తే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేం దుకు అవకాశం ఉండటంతో అధికారులు వారు ఇచ్చిన వివరాలను పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. పూర్తిగా సంతకాలను కేంద్ర బ్యాంకులో పరిశీలించిన అనంతరం ఈనెల 21న బ్యాంకులోనే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమావేశంలో డైరెక్టర్లందరూ హాజరుకావాలని కోరారు. అవిశ్వాసాన్ని కోరుతూ సంతకాలు చేసిన డైరెక్టర్లు శిబిరాలకు వెళ్లారు. అప్పటి నుంచి దూరంగానే ఉన్నారు. అవిశ్వాస సమావేశం రోజున హాజరుకానున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొంత మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరారు. వీరు చేరడంతో డీసీసీబీపై నజర్ పెట్టిన ఆ నేతలు సహకరించడంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టారు. వైస్‌చైర్మన్ చైర్మన్ అయ్యేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్టారని స్టే ఇవ్వాలని కోరారు. కోర్టు నేటికి వాయిదా వేయడంతో పాటు వివరాలను కోరింది. పూర్తి స్థాయిలో మంగళవారం విచారించడంతో పాటు అవిశ్వాస సమావేశంపై నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల షెడ్యూల్ రావడం అవిశ్వాసానికి రెండు రోజులే ఉండటంతో డైరెక్టర్లలో ఉత్కంఠ నెలకొంది. కోర్టు తీసుకునే నిర్ణయం ఆధారంగానే జరిగే అవకాశం ఉంది. చైర్మన్ గిరిని కాపాడుకునేందుకు భాస్కర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తుండగా అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు డైరెక్టర్లు ప్రయత్నిస్తున్నారు.





- బోర్డుపై హాల్‌టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

- జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, డీఈవో
- పరీక్షలు రాసిన 21,870 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 141 పరీక్ష కేంద్రాలు



- బాలికల కళాశాల వద్ద..

నిజామాబాద్ అర్బన్, మార్చి 18: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తెలుగు పరీక్షను నిర్వహించారు. మొత్తం 21,914 మంది విద్యార్థులకు గాను 21,870 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ 3 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 11 పరీక్షా కేంద్రాలను, జిల్లా పరిశీలకులు 10 పరీక్షా కేంద్రాల ను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 49 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద సందడి..

పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం నుంచే సందడి వాతావరణం కనిపించింది. మొదటి సారి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తుండటంతో తల్లిదండ్రులు విద్యార్థుల వెంట వచ్చి వారికి ధైర్యం చెప్పారు. పరీక్షలు బాగా రాయాలని ఆందోళన చెందవద్దని పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు చెప్పడం కనిపించింది. ఉద యం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా విద్యార్థులు గంట ముందు నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు.



- కాకతీయ స్కూల్ వద్ద..





ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతుల బలవన్మరణం


● నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య ● నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఘటన


చెరువులో పడి ఉన్న దంపతుల మృతదేహాలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 : ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. బోధన్ మండలం అమ్దాపూర్‌కు చెందిన బాబయ్య (65), పోచమ్మ (60) భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలల క్రితం నిజామాబాద్‌కు వచ్చి భిక్షాటన చేస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అయితే రోజురోజుకూ ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో.. నిత్యం పొట్ట గడవడమే కష్టంగా మారింది. దీంతో మనస్థాపానికి గురైన బాబయ్య, పోచమ్మ దంపతులు సోమవారం నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగర ఆరో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

యంచలో చెక్‌పోస్ట్ ఏర్పాటు

నవీపేట,మార్చి18 : నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని యంచలో ఆదివారం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం, నగదు సరఫరా కాకుండా ప్రత్యేక పోలీసు సిబ్బందితో ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం యంచ చెక్‌పోస్టును ఎస్సై యాదగిరి గౌడ్ పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వైపు తండ్రి చావు.. మరోవైపు పరీక్షలు..

● పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని


విద్యార్థిని స్రవంతి

నసురుల్లాబాద్, మార్చి 18 : తండ్రి మరణించిన బాధను దిగమింగుకొని ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షకు హాజరైన ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. నసురుల్లాబాద్‌కు చెందిన దండు శ్రీను (50) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పదో తరగతి చదువుతున్న అతని రెండో కూతురు స్రవంతి సోమవారం పదవ తరగతి పరీక్షకు హాజరైంది. కుటుంబీకులు ధైర్యం చెప్పడంతో.. తండ్రి మృతిని దిగమింగుకొని, పరీక్ష రాసింది.


నవీపేట రైల్వే గేటుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

రైల్వే గేటుకు తాళం పడకపోవడంతో నిలిచిన రైలు


● నవీపేటలో గంట పాటు నిలిచిన వాహనాలు

నవీపేట,మార్చి18: నవీపేటలోని ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేటుకు సోమవారం సాయంత్రం తాళం సరిగా పడకపోవడంతో సిగ్నల్ బయటనే రైలు నిలిచిపోయింది. నాగర్‌సోల్ నుండి కాచిగూడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండడంతో గేట్‌మెన్ గేటును మూసి వేయగా.. దానికి తాళం పడలేదు. దీంతో స్టేషన్ నుండి సిగ్నల్ క్లియర్ కాకపోవడంతో సిగ్నల్ బయటనే రైలు నిలిచిపోయింది. దీంతో గేట్‌మెన్ తాళాన్ని సరి చేయడానికి ప్రయత్నిస్తూ, ఎమర్జెన్సీ గేటును వేశారు. దీంతో రైలు ముందు కు వెళ్లగా సుమారు గంట పాటు గేటుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.









రైతులకు భారంగా వరికోతలు

- పంట నేలకొరగడంతో కోతలకు ఇక్కట్లు
- కోతలకు పెరిగిన యంత్రాల చార్జీలు
- రైతుకు భారంగా మారిన ఖర్చులు

ఎడపల్లి, మార్చి 18: మండలంలో యాసంగి సీజన్‌లో వేసిన వరిపంట కోతలు మొదలయ్యాయి. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు మండలంలో దాదాపు 930ఎకరాల వరిపంట నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. నేలకొరిగిన వరిపంటను యంత్రం సాయంతో కోయడానికి దాదాపు 4గంటల సమయం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపంట నిటారుగా ఉండి యంత్రం సాయంతో కోస్తే గంట సమయం పట్టేది. గంటకు యంత్రానికి 2500 రూపాయలు చెల్లించేదని కానీ అకాల వర్షంతో 10వేల వరకు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఎకారానికి 7 వేలు అధికంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఒక్క ఎడపల్లి మండలంలోనే ఈదురుగాలులు, 33 మి.మీల అకాల వర్షం కురవడంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. మండలంలో సుమారు 30 శాతానికి పైగా సాగు చేసిన వరిపంటలు కోతకు వచ్చిన సమయంలో ఈ ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని దిగులు చెందుతున్నారు. గతంలో మాదిరిగా అకాల వర్షం ఈదురుగాలులకు నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేసుకుని ఎలాంటి పరిహారం అందించక పోవడం శోచనీయమని, ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కాగా,



వరి పంట కోస్తున్న రైతు దృశ్యం

మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులోగల 40 ఎకరాలు కౌలు తీసుకుని పంట సాగుచేయగా కోతకు వచ్చిన పది ఎకరాలను సోమవారం కోయడంతో ఒక ఎకరానికి వరినూర్పిడి యంత్రం నేలకొరిగిన వరిపంటను నాలుగు గంటలకుపైగా సమయంలో కోయడంతో సుమారు 7 వేలకుపైగా అదనపు భారం పడిందని ఆయన వాపోయాడు.



ప్రధాని మోదీని కలిసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

మోదీని కలిసిన బోధన్ బీజేపీ నాయకులు

బోధన్ రూరల్, మార్చి 18: జగిత్యాలలో విజయ సంకల్ప సభ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా బోధన్ రాజకీయంపై చర్చించినట్లు మేడపాటి ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

జైతాపూర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారి



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారి

ఎడపల్లి, మార్చి 18: మండలంలోని జైతాపూర్ గ్రామాన్ని సోమవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిని కిరణ్మయి సందర్శించారు. గ్రామంలోని వివిధ శాఖల అధికారులతో ఆమె మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 5 రోజులపాటు గ్రామంలో సందర్శించి అన్నిరకాల అంశాలపై పర్యవేక్షణ జరిపి తయారు చేసిన నివేదికను పైఅధికారులకు అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గోపాలకృష్ణ, ఆర్ఐ వినోద్, పంచాయితీ కార్యదర్శులు నాగేష్, ఉదయ భాస్కర్ తదితరులు ఉన్నారు.

మోదీ సభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు



సిరికొండ నుంచి జగిత్యాలకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు



ముప్కాల్ నుంచి జగిత్యాలకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

ముప్కాల్, మార్చి 18: జగిత్యాల్ జిల్లాలో నిర్వహిస్తున్న తెలంగాణ బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభకు సోమవారం బాల్కొండ, ముప్కాల్ మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్రమోదీ విచ్చేసి ప్రసంగించనున్నారు. తరలివెళ్లిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, సంతోష్‌రెడ్డి, ఎంపీటీసీసభ్యురాలు నాయకుడు పద్మ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, కెఎం రెడ్డి ఉన్నారు.

నవీపేట: జగిత్యాలలో సోమవారం జరిగిన భారీ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో జగిత్యాలకు తరలివెళ్లారు.

సిరికొండ: సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సమావేశానికి సిరికొండ మండలం నుంచి బీజేపీ నాయకులు బస్సులో తరలివెళ్లారు. మండలం నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రుమాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్సుల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. వారి వెంట జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బీసీ మోర్చ జిల్లా కార్యదర్శి రామస్వామి, మండల బీసీ అధ్యక్షుడు సతీష్, యువమోర్చా మండల అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సంద్ర శంకర్, సంజీవ్‌రెడ్డి, మురళి, లింబాద్రి, సాయికుమార్ ఉన్నారు.

పెద్దబజార్: జగిత్యాల్ జిల్లాలోని గీత విద్యాలయం గ్రౌండ్‌లో జరుగుతున్న బీజేపీ విజయసంకల్ప బహిరంగ సభకు సోమవారం జిల్లా కేంద్రం నుంచి భారీగా నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వెంట బీజేపీ జిల్లా నాయకులు, కార్పొరేటర్లు ఆకుల హేమలత శ్రీనివాస్, మమత ప్రభాకర్, సుక్కమధు, మాస్టర్ శంకర్, కార్యర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల వేసవి ప్రత్యేక శిబిరం

ఆర్మూర్‌రూరల్, మార్చి 18: మండలంలోని గోవింద్‌పేట్, ఫత్తేపూర్, పిప్రి గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 వాలంటీర్లు గోవింద్‌పేట్‌లో, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2, ఫత్తేపూర్‌లో, యూనిట్-3 విద్యార్థులు పిప్రి గ్రామాల్లో వేసవికాల ప్రత్యేక శిబిరంలో పాల్గొని సేవలందించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ.. జాతీయ సేవ పథకం కార్యక్రమం ఉత్తమమైందని, ఇందులో పాల్గొనడం వల్ల విద్యార్థులు సమాజంలో బాధ్యత కలిగిన పౌరులుగా తయారు కావడానికి అవకాశం లభిస్తుందన్నారు. వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామాలలో శ్రమదానం, చైతన్య సదస్సులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు వెంకటేశ్వర్‌లు, అనితపవార్, వీడీసీసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలస్వామి

వన్నెల్(బి)లో వెంకటేశ్వరస్వామి పల్లకీసేవ

ముప్కాల్, మార్చి 18: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. సోమవారం ఉతయం ఉత్సవమూర్తులు అభిషేకం, నూతన వస్త్రాలంకరణ అనంతరం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళహరతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో హోమం, దేవత హవనం, కలశపూజ వంటి పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగే స్వామివారి కళ్యాణ మహోత్సవానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

దేవత మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలు

ఆర్మూర్‌రూరల్, మార్చి 18: ఆర్మూర్‌మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో శివపంచాయతన సహిత హన్మాన్ దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విగ్రహాల ఊరేగింపు అనంతరం ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. బుధవారం శ్రీ హంపి విరుపక్ష విద్యరణ్య స్వామిజి చేతుల మీదుగా శివపంచయత నవగ్రహా, ధ్వజశిఖర సహీత హన్మాన్ దేవత మూర్తులు, యంత్ర స్థాపన, మూర్తుల ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఇట్టెడి గంగారెడ్డి, కోశాధికారి తిరుపతిగౌడ్, ప్రధానకార్యదర్శి గడ్డి కార్తిక్, సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదు'

ఆర్మూర్‌టౌన్, మార్చి 18: పట్టణంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి అటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ అన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పట్టణంలోని బాలికల పాఠశాల, జావిద్‌బాయ్ మినీస్టేడియంలో సొంత ఖర్చులతో అభివృద్ధి పనులను చేస్తే ఆదివారం గుర్తుతెలియని వారు బాలికల పాఠశాలలో తాళలు పగులగొట్టి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లను ధ్వంసం చేశారని, అలాగే జావిద్‌బాయి మినీస్టేడియానికి కట్టిన కంపౌండ్‌వాల్ ధ్వంసం చేశారని అన్నారు. వీరి వెనుక ఎవరి హస్తం ఉందో పోలీసులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పెద్దోళ్ళ భరత్, ఉదయ్‌గౌడ్, సాంబాడి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోధన్ రూరల్, మార్చి 18 : సాలూర మండలంలోని హున్సా సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ కార్యదర్శి హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దు తిరుగుడు పంటను పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి క్వింటాల్‌కు రూ.6750 పొందాలన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్, వినోద్‌రావు, సంజు పటేల్, సంగ్రామ్ పటేల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ముప్కాల్, మార్చి 18: ఉమ్మడి బాల్కొండ మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. బాల్కొండ మండలంలో 488మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ముప్కాల్ మండలంలో 211మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, మెండోర మండలంలో 355మంది విద్యార్థులకు గాను 354మంది పరీక్షలు రాయగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

మాక్లూర్: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. మండలంలోని ఆయా పరీక్ష సెంటర్‌లో 630మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

మనోహరాబాద్‌లో ఇసుక డంప్ వేలం

జక్రాన్‌పల్లి, మార్చి 18: మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సోమవారం ఇసుక డంప్‌ను అధికారులు వేలం వేశారు. తహసీల్దార్ కిరణ్మాయి పోలీసుల సమక్షంలో ఇసుక డంప్ వేలం నిర్వహించారు. గత వారం రోజుల క్రితం ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక డంప్‌ను గుర్తించి మైన్స్, రెవెన్యూ, పోలీసులు గుర్తించి సీజ్ చేసిన విషయం విధితమే. ఈ మేరకు మనోహరాబాద్ గ్రామంలో అధికారులు ఇసుక డంప్ వేలం నిర్వహించగా అదే గ్రామానికి చెందిన కురల చిన్న గంగారాం రూ.లక్ష 21వేల 500 వేలం పాట పాడి ఇసుక డంప్‌ను దక్కించుకున్నాడని అధికారులు తెలిపారు. వేలం పాటలో వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖాజానలో జమ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీన్, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 18: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మంజూరు చేసిన 2లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులు సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజు, భాస్కర్, ధర్మరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ గుర్తులను తొలగిస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్, మార్చి 18: ఎన్నికల కోడ్ రావడంతో గ్రామపంచాయతీ పంచాయతీ సిబ్బంది, రాజకీయ పార్టీల జెండాల గద్దెలకు రంగులు వేయడంతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డులు, నాయకుల ఫోటోలు, జెండాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. డొంకేశ్వర్ కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని రాజకీయ పార్టీల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ప్రధాన మంత్రి ముఖ్యమంత్రి ఫోటోలకు సంబంధించిన బోర్డులను తొలగించారు. పలు పార్టీలకు సంబంధించిన జెండా గద్దెలకు తెల్లరంగు వేశారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న పార్టీల బ్యానర్‌లను ఫ్లెక్సీలను విద్యుత్ స్తంభాలకు చెట్లకు ఏర్పాట్లు చేసిన వాటిని పంచాయతీ సిబ్బందిచే తొలగించారు.

కాంగ్రెస్‌లోకి ముప్కాల్ మాజీ సర్పంచ్

ముప్కాల్, మార్చి18: ముప్కాల్ తాజామాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మణికంఠ పంక్షన్‌హాల్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి కొమ్ముల శ్రీనివాస్‌కు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాపాలనలో చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జక్క రాజేశ్వర్, చంద రవి, ప్రవీన్, విజయ్, బద్దం సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రజాభవన్‌లో సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో బద్దంవాడకు చెందిన పెద్దమనుషులు, రైతులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రైతులకు ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పథకాలకు స్పందించి పార్టీలో చేరామని ముత్యాల సునీల్‌కుమార్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కడపాటి రాజేశ్వర్, జైడి నరేష్, బద్దం హన్మాండ్లు, చిన్నారెడ్డి, ఆశోక్, సుబాష్, మోతె గంగారెడ్డి, రాజ్‌భరత్, నితిష్, ప్రమోద్, గంగారెడ్డి, జైడి గంగారెడ్డి, జైడి మహిపాల్‌రమేష్‌తో పాటు సంఘ సభ్యులు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, పి.మహిపాల్, పుప్పాల అశోక్, చిన్న గంగారాం, గిర్మాజీ గోపి, రమేష్, గంగాధర్, అర్గుల రమేష్, నసీర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జక్రాన్‌పల్లి, మార్చి18: మండలంలోని గన్యాతాండా గ్రామానికి చెందిన అజ్మీర సాయినాథ్, అజ్మీర సాయికిరణ్, బానవత్ లోకేష్‌లు శ్రీరాం సాగర్‌లోని హెడ్‌రెగ్యులటర్ కాలువలో ప్రమాదత్తు పడి మృతి చెందగా వీరి కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గన్యతాండా ఎంపీటీసీ అంకం లక్ష్మీ జయప్రకాష్ విన్నవించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఇరువురి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి18: మండలంలో మనోహరాబాద్, చింతలూర్ గ్రామా లలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు సోమ వారం పశువైద్యాధికారి శిరీష తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో పశువులకు, ఆవులకు సుమారు 962పశువులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం

డొంకేశ్వర్, మార్చి18: రైతు నేస్తం కార్యక్రమానికి డొంకేశ్వర్ మండల రైతులురైతులు హాజరుకావాలని మండల వ్యవసాయాధికారిణి జ్యోష్నభవాని తెలిపారు. రైతులు పండించే వరి, ఆయిల్‌ఫాం, కూరగాయల సాగుపై మంగళవారం ఉదయం 10గంటలకు ఆర్మూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. పంటల సాగుపై రైతులకు కలిగిన సందేహాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఒకరికి 5 సంవత్సరాల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, మార్చి 18: బిడ్డలను చంపి తాను చనిపోవడనికి ప్రయత్నించిన పల్లెపు అమృతకు డిస్ట్రిక్ ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జి సునిత కుంచాల 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. లైజనింగ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిపెట్‌కి చెందిన పల్లెపు అమృత, తన భర్త శ్రినివాస్ అర్థిక ఇబ్బందుల కారణంగా తర చు గోడవ పడేవారు. ఈ నేపథ్యంలో 28-02-2023 నాడు గోడవ పడి దానికి తోడు తను అనరోగ్యంతో బాదపడుతున్న పల్లెపు అమృత విసుగుచెంది తన ఇద్దరు పిల్లలను 2 సంవత్స రాల మనశ్రియ, 6 నెలల మనుతెజను నందిపెటలోని గుత్ప ఎత్తిపోతల కెనాల్ లో తోసి వేసి తాను దుకాగా గమనించిన స్థానికులు కాపాడాగా అప్పటికె ఇద్దరు పిల్లలు చనిపోయారు. నందిపేట్ పోలీసులు ఐపీసీ 302, 309 ప్రకారం కెసు నమోదు చెసుకోని కోర్టులో దాఖాలు చేయగా విచారణ అనంతరం సెషన్స్ జడ్జీ సునిత కుంచాల పల్లెపు అమృతకు 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అదనంగా 1,000 రుపాయల జరిమాన విధించారు. జరిమానా కట్టని యడల మరో 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసువారి తరుపున పీపీ రవి రాజ్ వాదించారు.

సంక్షిప్త సమాచారం

మురికి మయంగా ఆర్మూర్ బస్టాండ్

● బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంత ● ఇబ్బందుల్లో ప్రయాణికులు



ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పడిన డ్రైనేజీ గుంత ఇదే..

పెర్కిట్, మార్చి18: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ మురికినీటితో దుర్భారంగా మారింది. బస్టాండ్ ఔట్‌గేట్ వద్ద ఏర్పడిన గుంత వల్ల ఎగువ నుంచి వస్తున్న మురికి నీరు బస్టాండ్‌లోని చేరుకొని దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం, అదే విధంగా ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లడానికి మురికినీటిలోనే నడిచివెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీకి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు రూ.5కోట్లు నిధుల మంజూరు

మోర్తాడ్, మార్చి18: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉషా పథకం ద్వారా రూ.5కోట్లు నిధులు మంజూరు అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద 13కళాశాలలు ఎంపిక కాగా నిజామాబాద్ జిల్లా నుంచి మోర్తాడ్ డిగ్రీ కళాశాల ఎంపికైందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులకు, ఉన్నతాధికారులకు ప్రాజెక్టు డైరెక్టర్ సౌందర్య జోసెఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం కింద వచ్చే నిధులతో కళాశాలలో మౌలిక వసతులకు, బాత్‌రూంలు, ల్యాబ్‌లు, గ్రంథాలయం అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాక న్యాక్ ఏ గ్రేడ్, హటనమాస్ స్టేటస్ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఖాజీ అతికుల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌టీఏ అధికారిణిని కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం



మొక్కను అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మార్చి 18:నూతనంగా నియమితులైన జిల్లా ఆర్‌టీఏ అధికారిణి దుర్గాప్రమీలను ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌టీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్ర సీనియర్ కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సుశాంక్



ఎంపికైన క్రీడాకారుడు

సుభాష్‌నగర్, మార్చి 18: తెలంగాణ రాష్ట్ర సీనియర్ కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సుశాంక్ ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామా నికి చెందిన కుంట సుశాంక్ తెలంగాణ రాష్ట్ర సీనియర్ కబడ్డీ పోటీలో కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. శిక్షణ శిబిరం అనంతరం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్య దర్శి జగదీశ్ యాదవ్ రాష్ట్ర జట్టును వెల్లడించారు. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా సుశాంక్‌ను నియమించారు. జాతీయ స్థా యి పోటీలు మహారాష్ట్ర రాష్ట్రం అహ్మద్‌నగర్‌లో మార్చి 21 నుంచి 24 వరకు జరుగనున్నాయి. సుశాంక్ కెప్టెన్‌గా వ్యవహరించడం పట్ల జిల్లా క్రీడాసంఘం నాయకులు లింగయ్య, సురేందర్, సాయాగౌడ్, సుబ్బారావు, గంగాధర్, రాజ్‌కు మార్, కోచ్ మీసాల ప్రశాంత్, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

సిద్ధాపూర్‌లో 115ఎకరాలలో పంట నష్టం



పంటను పరిశీలిస్తున్న వర్ని ఏఈవో

వర్ని,మార్చి18: వర్ని మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. వర్ని ఏఈవో ప్రవళిక సిద్ధాపూర్ గ్రామ శివారును పరిశీలించారు. 25ఎకరాల్లో మొక్కజొన్న, 80ఎకరాల్లో జొన్నపంట దెబ్బతిన్నట్లు ఆమె తెలిపారు. రైతులకు పంట నష్టం అందేలా భరోసా ఇచ్చినట్లు తెలిపారు. పంట నష్టం అంచనాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్‌కు నివేదిక సమర్పించనున్నట్లు ఆమె వెల్లడించారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

● మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలి : ఏసీపీ

బోధన్ రూరల్, మార్చి 18 : పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు.సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. బోధన్ మండలంలో 13 పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి నాగ్‌నాథ్ తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 2915 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2909 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఆరుగురు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలను ఏసీపీ శ్రీనివాస్ సందర్శించారు. పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు గాని, సెల్‌ఫోన్‌లను గాని అనుమతించవద్దని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎటువంటి జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉండకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందన్నారు.

రుద్రూరు: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్ష లు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షల కోసం మండలంలోని రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోటగిరిలో రెండు కేంద్రాలు ఉండగా పొతంగల్‌లో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 476మంది విద్యార్థులు ఉండగా 474 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో నాగనాథ్ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు 144సెక్షన్ విధించారు.

నవీపేట: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు తెలిపారు. నవీపేట మోడల్ పాఠశాల ఏ సెంటర్, మోడల్ పాఠశాల బి సెంటర్‌లతో పాటు జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ జన్నేపల్లి, జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్‌లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 621మంది విద్యార్థులకు గాను వందశాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నవీపేట మోడల్ పాఠశాల, నవీపేట జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ నారాయణ పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సిరికొండ:సోమవారం నుంచి ప్రారంభమైన పదోతరగతి వార్షిక పరీక్షలకు సిరికొండ మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 537 మంది విద్యార్థులు హాజరయి పరీక్షలు రాశారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. సిరికొండ మండలంలో పెద్దవాల్గోట్, కొండాపూర్,సిరికొండలో గల జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలురు 223, బాలికలు 314 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

మోపాల్:పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని బోర్గాం(పి), మోపాల్, ముదక్‌పల్లి, న్యాల్‌కల్ గ్రామాల్లో



బోధన్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రం

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు తగు చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు వచ్చే విధంగా చూడాలని ఉపాధ్యాయులు కోరారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేశారు.

ఇందల్వాయి:సోమవారం ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సుమారు గంట ముందుగానే చేరుకొని తమ హాల్‌టికెట్ నెంబర్‌ను ఏ గదుల్లో ఉన్నాయో చూసుకున్నారు.మండలంలోని గన్నారం,ఇందల్వా యి, ఎల్లారెడ్డిపల్లి, సిర్నాపల్లి, తదితర పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 485 మంది విద్యార్థులు పరీ క్షలకు హాజరయ్యారని అన్నారు. పరీక్షా కేంద్రాల్లోఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలన్నారు.

మోర్తాడ్:మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని విద్యాధికారి ఆంధ్రయ్య తెలిపారు. సోమవారం మండలంలో మోర్తాడ్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో, ప్రభుత్వ బాలుర పాఠశాలలో, పాలెం ప్రభుత్వ పాఠశాలలో మూడు సెక్టార్లు ఏర్పాటు చేశామని, 327మంది విద్యార్థులకు గాను అందరు పరీక్షలు హాజరయ్యారని ఆయన తెలిపారు.

డిచ్‌పల్లి: మండలంలోని 8 పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో సోమవారం 1233మంది విద్యార్థులకు గాను 1231 మంది పరీక్షలకు హాజరయ్యారని, ముగ్గుకు విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి రాజగంగారం ఒక ప్రకటనలో తెలిపారు. 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరిగాయి.

రెంజల్: మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలను ఎంఈవో గణేష్ రావు పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పర్యవేక్షించారు. మండలంలోని 338మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో ఒకరు గైర్హాజరు అవ్వగా మొత్తం 337మంది విద్యార్థులు పరీక్షలు హాజరై పరీక్షలు రాసినట్లు ఎంఈవో తెలిపారు.

పెర్కిట్: మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని విద్యాధికారి రాజగంగారాం తెలిపారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు గోవూర్, చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 118మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. మోస్రా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఒక విద్యార్థి గైర్హాజరు అయినట్లు సిట్టింగ్ స్క్వాడ్ గంగాధర్ తెలిపారు.

పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ మార్చి 18 : శనివారం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన వరి పంటను గ్రామాల్లో రెండు రోజులుగా పరిశీలిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఏఈవోలు గ్రామాల్లో రైతులతో కలిసి పంట పొలాలను సందర్శిస్తున్నారు. బలమైన ఈదురు గాలులతో కూడిన వడగండ్లు కురువడం వల్ల కోతకొచ్చిన వరిపంట నేలపాలయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సైతం పంట పరిశీలించి నష్టాన్ని అంచన వేయాలని ఆదేశించడంతో వ్యవసాయ అధికారులు తిరుగుతున్నారు. పెద్దవాల్గోట్, కొండూర్, సిరికొండ, మైలారం, పందిమడుగు, చీమన్‌పల్లి, తాటిపల్లి , దూప్యతండాల్లో అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచన వేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులకు జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో వ్యవసాయ అధికారి వెంకటేష్ పంపించారు. మండలంలో సుమారు 1552 ఎకరాలలో రాళ్లవానకు ధాన్యం రాలినట్లు అధికారులకు నివేదికను పంపించినట్లు వెంకటేష్ చెప్పారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఇందల్వాయి, మార్చి 18:ఈనెల 20వ తేదీన జరుగనున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఇందల్వాయి మండలంలోని 15 సంవత్సరాల మైనర్ బాలికకు సిరికొండకు చెందిన వేణుగోపాల్ తో బాల్య వివాహం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకొని అమ్మాయిని సోమవారం నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలను రాయిం చారు. అమ్మాయి గన్నారం ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదు వుతుందని కుటుంబ సభ్యులకు బాల్య వివాహంపై అవగాహన కల్పించి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అమ్మాయి భవిష్యత్తు కోసం పదోతరగతి పరీక్షల కు హాజరయ్యేలా చూస్తామని డిచ్‌పల్లి సీడీపీవో స్వర్ణలత తెలిపారు. వారి వెంట ఐసీడీఎస్ కౌన్సిలర్, సూపర్‌వైజర్, ఎస్సైఆర్‌ఐ, తదితరులు ఉన్నారు.

'ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి'

సిరికొండ మార్చి 18 : ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించలాంటే మన ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఏఐపీకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రజలను ఒక పత్రిక ప్రకటనలో కోరారు. ఈ నెల 19న గడ్కోల్, 20న రావుట్ల గ్రామాల్లో గ్రేస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏఐపీకెఎంఎస్ ఇతర ప్రజా సంఘాల నేతృత్వంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యంగా మనకు తెలియకుండానే క్యాన్సర్ మహమ్మారి బారిన పడి ఎందరో అభాగ్యులు మృత్యువాత పడుతున్నందున ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రజలు ముందు జాగ్రత్త కోసం ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మంగళ, బుధవారాల్లో క్యాన్సర్‌పై ఉచితంగా పరీక్షలు చేస్తున్నందున ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

బాధిత రైతులకు పరామర్శ



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

ఇందల్వాయి, మార్చి 18:శనివారం ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రా మంలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను సోమవారం బీజేపీ జిల్లా అధ్య క్షుడు కులాచారి దినేష్ ఆధ్వర్యంలో పరామర్శించారు. వడగండ్ల వర్షానికి దెబ్బ తిన్న పంటలను ఆయన పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయం అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. నల్లవెల్లి గ్రామంలో అకాల వర్షాల కారణంగా చేతికందిన పంట సుమారు 50 శాతానికి పైగా నేలకొరిగిందని ఆరుగాలం కష్టించి పండించిన పంట ప్రకృతి వైపరిత్యంతో కొట్టుకుపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడునాయుడు రాజన్న, నాయకులు మనోహర్, రాజన్న, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు నిత్యజీవితంలో భాగం కావాలి

ఆర్మూర్‌రూరల్, మార్చి18: పోషక విలువలున్న చిరుధాన్యాలు నిత్య జీవితంలో ఒక భాగం కావాలని ఏసీడీపీవో ఆర్.జ్యోతి అన్నారు. సోమవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలో చిన్నారులకు అన్నప్రసన, అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతాల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతీఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషకాలతో కూడిన వంటలను వివరించారు.ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడి ఉపాధ్యాయినీలు జగదాంబ, సంగీత, గోదావరి,లక్ష్మీ, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, మార్చి18: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివాలయంలోని సిద్దేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన పల్లకీ సేవలో ఆర్మూర్ భజన మండల సభ్యులు భక్తీగీతలు, నృత్యాలు ఆలరించారు.ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డి.సుమన, గంగారెడ్డి, మల్లయ్య, బోండ్ల ఆనంద్, సిద్దులగుట్ట సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రెండో మూల్యాంకనం
విధుల్లో పాల్గొనకపోతే చర్యలు

మూల్యాంకన క్యాంప్ అధికారి రవికుమార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 18:జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైం దని జిల్లా ఇంటర్మీడియేట్ మూల్యాంకన కేంద్రం క్యాంప్ అధికారి రవి కుమార్ తెలిపారు. బుధవారం నుంచి రెండో విడత అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానున్న నేపథ్యంలో మూల్యాంకన విధుల్లో పాల్గొనవల్సిన అధ్యాప కులు త ప్పక హాజరుకావాలని లేకపోతే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే ఆయా కళాశాలల లాగిన్‌లలో నియామకపత్రాలను ఉంచడం జరిగిందని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమం, మోడల్ స్కూల్, కేజీబీవీ, మైనార్టీ, బీసీ రెసిడెన్షియల్, ఇతర అన్ని జూనియర్ కళాశాలల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాప కులను తమ విధుల నుంచి రిలీవ్ చేసి మూల్యాంకన కేంద్రంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసిన విధుల్లో పాల్గొని అధ్యాపకులపై చర్యలు తీసుకుం టామన్నారు. వెంటనే అధ్యాపకులు తమకు కేటాయించిన మూల్యాంకన సబ్జెక్టులో రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు

గిరిరాజ్‌లో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, మార్చి 18:జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరియు ఇంపాక్ట్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా పేయింట్ యువర్ డ్రీమ్స్ అనే వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ట్రైనర్స్ మహేష్‌కు మార్, మహేందర్, నవనీత, వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డిలు వ్యక్తిత్వ వికా సానికి సంబంధించిన సందేశాలను ఇచ్చారు. కార్యక్రమంలో సత్య వరప్రసాద్, రంజిత, వేణుప్రసాద్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ ఇంటర్,ఎస్సెస్సీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్, మార్చి 18:తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడు దలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకట నలో తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి 5.30ల వరకు ఇంటర్ పరీక్షలు, ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 వరకు సాయంత్రం 5.30 వరకు పదవ తరగతి పరీక్షలను రెం డు సెక్షన్‌లలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారు పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని మే 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మే 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

కారులో చెలరేగిన మంటలు

● త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇందల్వాయి, మార్చి 18:ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి ఓ కారులో మంటలు చెలరేగడం తో త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీపక్ అనే వ్యక్తి నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఇందల్వాయి టోల్‌ప్లా జా దాటగానే కారు ఇంజన్‌లోంచి మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలో కారు అగ్నికి ఆహుతి అయ్యింది. అప్రమత్తమైన దీపక్ వెంటనే కారు లోంచి దిగి బయటకు రావడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు. టోల్‌ప్లాజాసిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్ ద్వారా మంటలను ఆర్పి వేశారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, మార్చి 18:మంగళవారం ఉదయం 10గంటలనుంచి రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఉద యం 10 గంటల నుంచి 10.30ల వరకు వరిలో ప్రస్తుతం పాటిం చాల్సిన మెలకువలపై జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ఫారం శాస్త్రవేత్త బి.శ్రీనివాస్ సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. ఉదయం 10.30ల నుంచి 11 గంటల వరకు ఆయిల్ ఫామ్ సాగుపై డాక్టర్ రాజ శేఖర్, ఉదయం 11గంటల నుంచి11.30ల వరకు వేసవి కూర గాయల సస్యరక్షణ మందుల వాడకంపై డాక్టర్ కె.కవిత సల హాలు, సూచనలు ఇవ్వనున్నారు.అన్నిరైతువేదికల వద్దరైతులకు ఈ సూచ నలు ఇవ్వనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.ఈ అవకా శాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మూడోసారైనా సంతల వేలంపాట ముడిపడేనా..!

● నేడు నవీపేట జీపీలో వారంతపు సంత, మేకల సంతల వేలంపాట

నవీపేట,మార్చి18: నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే వారంతపు సంత, శనివారం జరిగే మేకతల సంతల వేలంపాటను మూడవ సారి మంగళవారం నిర్వహించనున్నారు. ఇటీవల రెండుసార్లు సంబంధిత సంతలకు సంబంధించి వేలంపాట నిర్వహించగా అప్‌సెట్ ధర రాకపోవడంతో అధికారులు వేలంపాటను మంగళవారంకు వాయిదా వేశారు. గత సంవత్సరం మేకల సంత వేలంపాట 55.16లక్షలు పలకగా ఇటీవల నిర్వహించిన వేలం పాటలో 40.35లక్షల రూపాయల వద్ద నిలిచిపోయింది. వారంతపు సంతకు సంబంధించి గత సంవత్సరం 15లక్షలు వేలంపాట పలకగా ఇటీవల నిర్వహించిన వేలంపాటలో 4.61లక్షల వద్ద నిలిచిపోయింది. వేలంపాట దారులు సిండికేట్ కావడం వల్లనే అప్‌సెట్ ధర రావడం లేదని మంగళవారం నిర్వహించే వేలంపాటలో సైతం అప్‌సెట్ ధర వచ్చే అవకాశాలు కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మూడవ సారి నిర్వహించే వేలంపాట సమయంలో వ్యాపారులు సిండికేట్ కాకుండా అధికారులు కట్టడి చేస్తే గ్రామ పంచాయతీకి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

మోపాల్ సొసైటీ వైస్‌చైర్మన్ రాజీనామా

మోపాల్, మార్చి 18: మండలంలోని మోపాల్ సొసైటీ వైస్‌చైర్మన్ సింగిడి సుమన్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల చైర్మన్‌గా ఉన్న ఉమాపతిరావు రాజీనామా చేయడంతో గత నాలుగు రోజుల క్రితం చైర్మన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా ఉన్న సింగిడి సుమన్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు కావడంతో ఆయనపై కూడా అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో తానే ముందుగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రాన్ని కార్యదర్శి సాయికి అందజేశారు. ఇంకా ఆమోదం జరగలేదని కార్యదర్శి సాయి తెలిపారు. వైస్‌చైర్మన్ కోసం డైరెక్టర్‌గా ఉన్న తిరుపతి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి అత్యంత సన్నిహితం కావడంతో ఇతనికే వైస్ చైర్మన్‌గా వస్తుందని పలువురు డైరెక్టర్లు వ్యక్తం చేశారు. తిరుపతి కాకుండా మరో వ్యక్తిని నియమించాలని డైరెక్టర్‌లలో కొందరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

మానాల మోహన్‌రెడ్డి కలిసిన నాయకులు

సిరికొండ మార్చి 18: తెలంగాణ కోఆపరేటీవ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన మానాల మోహన్‌రెడ్డిని సిరికొండ, ధర్పల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. సోమవారం మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య,జిల్లా నాయకులు బండారి నరేష్,రామడుగు రామలయ గుడి చైర్మన్ బచ్చు పురుషోత్తం,దావీదు, ప్రదీప్ తదితరులు ఉన్నారు. చైర్మన్‌గా నియామకమైనందున ఆయనను సన్మానించారు.



మానాల మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.66,600	రూ.61,450	రూ.780

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : యోధ (హిందీ) (12.50)
: రజాకర్ (3.50, 7.10)
: ప్రేమలు (10.25)
స్క్రీన్-2 : కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (2.05, 7.40)
: ప్రేమలు (4.25)
: రజాకర్ (10.00)
స్క్రీన్-3 : సైతాన్ (హిందీ) (1.20, 4.20, 10.30)
: గామి (7.20)
స్క్రీన్-4 : రజాకర్ (1.00)
: భీమా (4.15)
: యోధా (7.20, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ప్రేమలు (1.30, 7.30)
: గామి (4.30, 10.30)
స్క్రీన్-2 : రజాకర్ (10.40)
: భీమా (1.40, 4.30, 7.40)
: యోధ (హిందీ) (10.40)
స్క్రీన్-3 : రజాకర్ (1.30, 4.30, 7.30, 10.30)

దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్: భీమా (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : తంత్ర (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్